ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రం టిబి యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల నుండి నటరాజ్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ వ్యాధి క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, లేదా తుమ్మినప్పుడు ఆ తుమ్పర్ల ద్వారా ఈ సూక్ష్మ క్రిములు ఇతరులకు వ్యాపించి వారిలో వ్యాధికి కారణమవుతాయని తెలిపారు. క్షయ వ్యాధిని కళ్ళే పరీక్ష ద్వారా గుర్తించి నిర్ధారించవచ్చని, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలలో వ్యాధికి సంబంధించిన మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కనుక ప్రజలందరూ క్షయ వ్యాధి విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ మండల కార్యదర్శి ఖాదర్బాషా డిమాండ్

విశాలాంధ్ర-సంతమాగులూరు : మండలంలో గత నాలుగు ఐదు రోజుల నుండి అకాల వర్షాలతో తీవ్ర గాలులతో బొప్పాయి అరటి మిరప తీవ్రంగా దెబ్బతినటం జరిగింది. ఈ నేపథ్యంలో సిపిఐ మండల కార్యదర్శి ఖాదర్బాషా శుక్రవారం కొమ్మలపాడు గ్రామంలో తడిసిన మిరప పరిశీలించారు. రైతాంగం ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే దశకు అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని నష్టపోయిన మిరప బొప్పాయి అరటి రైతులకు వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని లక్షల రూపాయల అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతి అందే దశకు నష్టాన్ని మిగిల్చాయని వెంటనే ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు చేపట్టి వ్యవసాయ అధికారులు ఉద్యానవన శాఖ సర్వేలు చేసి నష్టపోయిన రైతాంగానికి ఆదుకోవాలని కోరారు.

వీరేంద్ర ఎక్స్పోర్ట్స్ గ్రానైట్ పరిశ్రమ ప్రారంభం

విశాలాంధ్ర-గిద్దలూరు : చీమకుర్తిలో దేవకి వెంకట సత్యనారాయణ సుశీలలు నూతనంగా ఏర్పాటు చేసిన వీరేంద్ర ఎక్స్పోర్ట్స్ గ్రానైట్ పరిశ్రమ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమానికి గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రానైట్ పారిశ్రామిక రంగంలో పేరు ప్రతిష్టలు పొంది ఆర్థికంగా వృద్ధి చెందాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మొగిలిశెట్టి వివేకానంద, కార్యదర్శిగా పుల్లంశెట్టి శ్రీనివాసరావు, ట్రెజరీగా హనుమంతునిపాడు మండల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కత్తికిషోర్‌ను ప్రకాశంజిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కత్తి కిషోర్‌ను ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్‌గా ఎన్నికైన సందర్భంగా హనుమంతునిపాడు మండల ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, కత్తి తిరుపాలు, వేసపోగు గురుప్రసాద్‌లు కలసి అభినందనలు తెలియజేశారు. ట్రెజరర్‌గా ఎన్నికైన కత్తి కిషోర్ మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన గ్రౌండ్ నిర్మిస్తామని మన జిల్లా నుంచి రంజీ టీంకు, మరియు స్టేట్ టీంకు, క్రీడాకారులు సెలెక్ట్ అయ్యే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు.క్రీడాకారుల నుండి డబ్బులు వసూలు చేసే వారితో జాగ్రత్తగా ఉండాలని ఏవైనా సందేహాలు ఉంటే 7013260949 ఈ నెంబర్‌కి ఫోన్ చేయగలరు.

అనురాధ గెలుపు ప్రజా విజయం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంచుమర్తి అనురాధ గెలుపొందడం ప్రజా విజయం అని హనుమంతునిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి హర్షం వక్తం చేసినారు. అనురాధకు వైసీపీ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారంటే సీఎం జగన్‌పై ఎమ్మెల్యేలకు అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి పట్టభద్రులు బ్రహ్మరథం పలికినారు. సైకో పాలనకు కాలం చెల్లిందన్నారు. ప్రజా సంక్షేమం గాలికి వదిలేసిన వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తోనే అభివృద్ధి సాధ్యం అని ప్రజలు గుర్తిచారన్నారు. అలానే 2024ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాదిస్తుందని కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఇష్టపడి చదివితే విజయం వెన్నంటే

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఇష్టపడి చదివితే విజయం మీ వెన్నంటే ఉండి విజయతీరాలకు చేరుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పాఠశాల వార్షికోత్సవం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ముందు ఉంచుకొని చదివి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కడం ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మౌలిక వసతులు కల్పనకు తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇటీవల పాఠశాల ఆవరణలో తమ సొంత నిధులతో సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేయడం కూడా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దాసరి లక్ష్మీ గురుస్వామి, యుటిఎఫ్ నాయకులు అబ్దుల్ హై కృపారావు గోన శ్రీనివాసులు మర్రిపాలెం చిన్నారి కట్ల కొనకనమిట్ల ఏ ఏ హెచ్ డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.కాశిరెడ్డి పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం

- వైసీపీలో నలుగురు ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై చర్చ
- ఉత్సాహంలో టీడీపీ శ్రేణులు
- అంతర్మథనంలో వైసీపీ నేతలు
- ఏ చోట నలుగురున్నా రాజకీయాలపైనే మాటలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :

ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడె క్కింది. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మూడు చోట్ల విజయం సాధించడం, అనంతరం ఎమ్మెల్యే కోటా క్రింద జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలతో ఒక స్థానం టీడీపీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. 24 గంటలు తిరగక ముందే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వైసీపీకి చెందిన నలుగురు శాసనసభ్యులు ఆ పార్టీ సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఏ చోట నలుగురు చేరినా రాజకీయాలపైనే చర్చ జరుగుతుంది. వైనాట్ 174 సీట్లు ఎందుకు గెలవలేం అని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిన్నటివరకు చెప్పిన మాటలు. ఒక్కసారిగా రాష్ట్రంలో పరిణామాలు మారిపోయాయి. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అనూహ్యంగా టీడీపీ మంచి మెజార్టీతో విజయం సాధించింది. అనంతరం ఎమ్మెల్యేల కోటాలో కూడా వైసీపీకి చెందిన వైసీపీ ఎమ్మెల్యేల ఓట్లతో ఒక ఎంఎల్‌సి స్థానాన్ని కైవసం చేసుకోవడంతో టీడీపీ నాయకత్వం, కేడర్ నూతనోత్సాహంతో ఉండగా వైసీపీలో అంతర్గతంగా ఏమి జరుగుతుందోనని ఆ పార్టీ అధిష్టానం తర్జన భర్జన పడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్టు వైయస్ఆర్ సీపీ ఆ పార్టీకి చెందిన నలుగురిని గుర్తించింది. వీరిలో ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్ర శేఖర్‌రెడ్డిలుగా ఆ పార్టీ గుర్తించింది. ఆ నలుగురిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా వైసీపీలో కూడా అసలు ఏం జరుగుతుంది, ఏమిటనే దానిపై చర్చ మొదలైంది. పార్టీ అధిష్టాన నిర్ణయాలకు అనుగుణంగా నడుచుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ వైసీపీ హెచ్చరిక జారీ చేసింది. చేస్తూనే మా పార్టీ ఎమ్మెల్యేలను తెలుగుదేశం పార్టీ నేతలు కొనుగోలు చేశారంటూ ప్రచారం చేస్తున్నారు. దీనికి కౌంటర్‌గా తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను వైసీపీ తరపున ఎందుకు ఓట్లు వేయించు కున్నారంటూ నిలదీశారు. మొత్తం మీద ఎమ్మెల్సీ ఎలక్షన్లు తెలుగుదేశంలో నూతనోత్సాహాన్ని తీసుకు రాగా వైసీపీ శ్రేణుల్లో మాత్రం అంతర్మథనాన్ని సృష్టించింది. ఎక్కడ చూసినా రాజకీ యాలపైనే ప్రధాన చర్చ జరుగుతుంది.

రైతన్నలపై కేసులు లేకుండా చూడాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-గిద్దలూరు : పొలాల్లో పంటలను సంరక్షించి, కాపాడుకునే చర్యల నేపథ్యంలో అడవి పందులు ఏ ప్రమాదానికో గురై మరణిస్తే అటవీ అధికారులు తమ చట్టాన్ని రైతులపై నిర్దాక్షిణ్యంగా ప్రయోగించి జరి మానాలు, కేసులు నమోదు చేస్తున్నారని దీంతో ఆరుగాలం శ్రమించే రైతన్న ఆవేదనకు గురవుతున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు శుక్రవారం అసెంబ్లీలో సభ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మొన్నటిదాకా ఉమ్మడిగా ఉండి, ప్రస్తుతం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణలో రైతులకు ఇలాంటి జరిమానాలు, కేసులు లేవని గుర్తు చేస్తూ మన రాష్ట్రంలో కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్య మంత్రి జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచి వాలయ వ్యవస్థ అమలు ఫలితంగా గ్రామ స్థాయిలోనే సర్వేయర్ అందు బాటులో ఉన్నారని, వారిద్వారా, వాగు, కుంట, చెరువు పోరం బోకులుగా ఏ ప్రదేశాలు ఉన్నాయో వాటిని సర్వే చేయించి హద్దులతో స్థిరీకరిస్తే అన్యాక్రాంతం కాకుండా ఆ భూములు కాపాడబడతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే ద్వారా ప్రభుత్వ భూములుగా నిర్ధారించబడ్డ పొలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ట్రెంచింగ్ (కందకాలు) పనులు చేపడితే నీరంతా ఎక్కడి కక్కడ ఇంకిపోయి గిద్దలూరు నియోజక వర్గం వంటి వర్షాధారిత ప్రాంతాలకు భూగర్భజలాలు పెరిగి ఎంతో మేలు జరుగుతు oదని సంబంధిత మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ హామీ : ఎమ్మెల్యే రాంబాబు ప్రస్తావించిన అనంతరం ప్రభుత్వం తరపున మంత్రి జోగి రమేష్ స్పందిస్తూ ఈ మూడు అంశాలను సంబంధిత మంత్రులకు తెలిపి సానుకూలంగా స్పందించేలా చూస్తామని సభలో హామీ ఇచ్చారు.

పశువులకు గాలికుంటు టీకాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని అన్ని గ్రామాలలో పశువు లైన గేదలు, ఆవులు, గొర్రెలు, మేకలు కు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారిని ఎం.విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 25 శనివారం నుండి వచ్చేనెల ఏప్రిల్ 24 వరకు అన్ని గ్రామాలలో గాలికుంటు టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. పశుపోషక యజమానులు మీ గ్రామాల్లో జరగనున్న పశు వైద్య శిబిరాలకు వెళ్లి మూగజీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని ఆమె తెలిపారు.

రీ సర్వేకు రికార్డులు సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని గ్రామాలలో గల భూముల రీ సర్వేకు రెవెన్యూ రికార్డులు సిద్ధంగా ఉండాలని తహసిల్దార్ ఎస్ ఉషారాణి తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం రి సర్వే పై వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వేకు ఎంపిక చేయబడిన గ్రామాల వీఆర్వోలు సంబంధిత రెవెన్యూ రికార్డులు పూర్తిగా అందుబాటులోకి ఉంచుకొని సిద్ధంగా ఉండాలన్నారు. రీ సర్వేలో ఎక్కడ కూడా ఆటంకాలు లేకుండా సర్వే జరిగేంతవరకు సహకరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ముందుగా అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసిల్దార్ టి రవికాంత్, సీనియర్ అసిస్టెంట్ పి శేషగిరిరావు, మండల సర్వేయర్ శివ ప్రసాద్, వీఆర్వోలు పెద్దన్న, కోటయ్య, దయానందం, మురళి, రవి, గురవయ్య, జాన్ లిపి, రమణ, అయ్యప్పరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుశీల, పున్నారావు పాల్గొన్నారు.

రైతుల నుండి సర్వే నంబర్లు సేకరించాలి

- ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని గ్రామాలలో భూముల రీ సర్వే కోసం సర్వే నంబర్ల వివరాలను సేకరించాలని ఒంగోలు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలవరం, పెదరావిపాడు, తూర్పు కంభంపాడు, కెల్లంపల్లి గ్రామాలకు సంబంధించిన భూములను డ్రోన్ కెమెరా ద్వారా ఫోటోలు తీయడం జరిగిందని ఆ భూములు వివరాలను మండల కార్యాలయానికి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసీల్దార్ టి రవి కాంత్, సీనియర్ అసిస్టెంట్ పి శేషగిరిరావు, మండల సర్వేయర్ శివ ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్‌తో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నందు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల జమ్మలమడక గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రాత్రులు దోమల బెడద నుండి దోమతెరలు వాడాలన్నారు. ఈ శిబిరంలో 55మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ వెంకటరావు, డీఈవో, వెంకట ప్రసాద్, ఏఎన్ఎం పద్మాంజలి, మస్తానమ్మ, గృహలక్ష్మి, రొంపిచర్ల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్ అదృశ్యం

విశాలాంధ్ర-దర్శి : దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నూనె వినోద్ గత నెల 24వ తేదీ నుండి డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లి అదృశ్యం అయ్యాడు. దొనకొండ మండలం చందవరం ఇతని స్వగ్రామం. ఇతని ఆచూకీ తెలిసినవారు ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని ఎస్సై రామకృష్ణ అన్నారు. 9121102162 మరియు సిఐ దర్శి 9121102161 ఎస్‌డిపీవో దర్శి 9121102160 తెలియజేయాలన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దర్శి : దర్శి మంజునాథ్ వెంచర్‌లో మాజీ వైస్ ఎంపీపీ మారం శ్రీనివాస్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ హాజరయ్యారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి విందు చేశారు. వైస్ ఎం.పి.పి సోము దుర్గరెడ్డి, సచివాలయం కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర బ్యుటిపికేషన్ డైరెక్టర్ కుమిత అంజిరెడ్డి, గొల్లపటి అచ్చయ్య, సనికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా చీమకుర్తి పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నుండి ఇసుక వాగు సెంటర్ మీదుగా హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ వయసులో నైనా, ఎవరికైనా క్షయ వ్యాధి సోకవచ్చని ఇది శరీరంలో ఏ భాగానికైనా రావచ్చుఅని మనిషి శరీరంలో ఎక్కువ భాగం ఊపిరితిత్తులకు ఈ వ్యాధి సోకుతుందని వైద్యపరిభాషలో శ్వాసకోశ క్షయ అంటారని ఈ క్షయ వ్యాధి సోకిన వారికి రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గటం, ఛాతిలో నొప్పి, ఉమ్మినప్పుడు రక్తం పడటంలాంటి కూడిన లక్షణాలు ఉంటాయని ఇలా ఎవరికైనా ఉన్నట్లయితే వెంటనే మీ దగ్గరలో ఉన్న ఆశవర్కర్లకు లేదా ఏఎన్ఎంల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్‌లో తగిన పరిక్షలు నిర్వహించి క్షయ వ్యాధికి సంబంధించిన మందులు ఉచితం గానే ఇస్తారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మరియు హెల్త్ వర్కర్స్ ర్యాలీలో పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల కేంద్రమైన తాళ్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో, తూర్పు గంగవరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లూరులో వైద్యాధి కారులు డాక్టర్ ఎస్కే ఖాదర్ మస్తాన్ బి,డాక్టర్ హనుమాన్ నాయక్ ,వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ నిర్వహించి గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కలిగించ డానికి ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా తూర్పు గంగవరం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో బొద్దికూరపాడు గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ బి.రత్నం, మహిళా వైద్యురాలు డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది సహాయంతో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామంలోని నలుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ బి రత్నం మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాపించే వ్యాధి అని, నిరంతరం దగ్గుతూ ఉండడం, రాత్రివేళ జ్వరం రావడం, బరువు తగ్గడం, లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే పరీక్ష చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఒక క్షయ వ్యాధిగ్రస్తుడిని దత్తతకు తీసుకొని సంవత్సరంలో అతని కయ్యే 5000 రూపాయలు అందించి ఆయన ఆదుకున్నారు. ఈ కార్య క్రమంలో రెండు వైద్యశాలల వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పంట రుణాలు పొందాలంటే ఒకే రకం పంట నమోదు చేయాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : సున్నా వడ్డీ పంట రుణాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఒకే రకం పంటలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్, సిబ్బందితో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రాయితీలు, నష్టపరిహారం పొందాలంటే ఈ క్రాప్ నమోదులో ఉపయోగించిన పంట, పంట రుణాలు పొందేటప్పుడు నమోదు చేయబడిన పంట ఒకే రకంగా ఉండాలని వాటిలో తేడాలు ఉన్నట్లయితే సున్నా వడ్డీ రుణాలు వర్తించవని ఇతర ప్రభుత్వ రాయితీలు కూడ లభించడం కష్టసాధ్యమని ఆయన తెలిపారు. బ్యాంకుల నుండి పొందిన పంట రుణాలు సక్రమంగా చెల్లించి రాయితీలు పొందాలని ఆయన సూచించారు. తాళ్లూరు కెనరా బ్యాంక్ మేనేజర్ షరీఫ్, ఫీల్డ్ అసిస్టెంట్ అరవిందన్, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

పెన్సిల్లు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని తూర్పు గంగవరం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ బి రత్నం ఆధ్వర్యంలో మండలంలోని బొద్ది కూరపాడు గ్రామంలో గల మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వైద్యాధికారి డాక్టర్ బి రత్నం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఏదో ఒక సహాయం చేయాలని ఆలోచనతో పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థిని విద్యార్థులకు పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేసి చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహ వైద్యురాలు డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన శ్రీను

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ప్రతిష్టాత్మక మైన స్కాలర్‌షిప్ ఇచ్చే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అరివేముల విద్యార్థి జక్కుల శ్రీను ఎంపికైనట్లు అరివేముల జడ్‌పిహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు యస్ కవితా ప్రియ తెలిపారు. శ్రీను ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని ఎల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి బి.మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలని అన్నారు. పది ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయనీ, విద్యార్థి సమగ్ర అభివృద్ధికి సూచికగా నిలుస్తాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బైసాని.రామకృష్ణ మాట్లాడుతూ లక్ష్యం సాధించడానికి ఏకాగ్రత అవసరమనీ, ఇష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మరియు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా స్నేహం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు స్నేహం సుబ్బారావు పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను బహుకరించగా, గ్రంథాలయ అభివృద్ధికి తెలుగు ఉపాధ్యాయుడు స్వర్గీయ సుసర్ల. సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి సతీమణి ఉమాదేవి పదివేల రూపాయలు ఎంఈఓ చేతుల మీదుగా అందించారు. అనంతరం మధ్యాహ్న భోజన తయారీ వంట కార్మికులను, పాఠశాల పారిశుధ్య కార్మికులను పాఠశాల సిబ్బంది సగౌరవంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీ రామలింగయ్య, విద్యార్థులు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాలను శుక్రవారం సర్పంచ్ బి.రజిని ఆకస్మి కంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను, పరిశీలి ంచారు. రోజువారి మెనూలో భాగంగా శుక్రవారం అన్నము ఆకుకూర పప్పు, చిక్కీ మరియు గ్రుడ్డు వడ్డించగా విద్యార్థులతో సహా పంక్తి భోజనాలను చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, సిఆర్పీ రవీంద్ర నాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని కనిగిరి మాజీ శాసనసభ్యులు కావలి నియోజకవర్గం పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న 21వ ఆర్.సి.సి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం కదిరి బాబురావు ప్రారంభించారు. క్రికెట్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మాట్లాడుతూ పండుగ దినాలలో యువత చేడు వ్యసనాలవైపు వెళ్లకుండా ఉండడానికి గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే క్రికెట్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకొని ఆటలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో చందన పట్టాభి రామేశ్వరరావు, కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారధి, కదిరి బాలకృష్ణ, సర్పంచ్ షేక్ ఖాదర్ బి.బుజ్జి, కె.వి.యస్ యల్+2 కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ ఇరగని చలపతిరావు, ఉపసర్పంచ్ టి.బాబురావు, మాజీ యంపిటీసీలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, కె బి ఆర్ వ్యవసాయకళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, యం.గోపి,షేక్ నాయబ్ రసూల్, షేక్ ఖాజావలి, మన్నేపల్లి రవికుమార్, షేక్ అహమ్మద్, తోట వెంకటేశ్వర్లు, పోకల మాల్యాద్రి, అంకయ్య యాదవ్, బోయన మహేంద్ర, పిడుగు హరినారాయణ, ఇరగని మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవ కోసం ముందుకు రావాలి

విశాలాంధ్ర-కనిగిరి : ఎస్విఏపియల్ టూ హెచ్ ఎస్ఎఫ్సి ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, ఎయిర్‌మ్యాన్ ఐఏస్ కార్యదర్శి, డి.సెయింట్ ఉమా హేశ్వల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటిగ్రేడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ కార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొ రేషన్ చైర్మన్ వెంకటగిరి పరిశీలకులు చింతలచెరువు సత్య నారాయణరెడ్డితో పాటు వారి తనయుడు పారిశ్రామికవేత్త చింతలచెరువు సందీప్ రెడ్డితో పాల్గొన్నారు. చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇస్రో నింగికి పంపిస్తున్న రాకెట్లలో తాము భాగస్వాములుగా నిలవడం సగర్వంగా ఉందన్నారు. దేశం కోసం ఎనలేని సేవలందిస్తున్న ఇస్రోలో తాము భాగస్వామ్యం కావడం నిజంగా గొప్ప విషయమని దేశ సేవ కోసం సమాజంలోని ప్రతి విద్యార్థి చదువుకొని దేశానికి సేవ అందించేందుకు సైంటిస్టులుగాను ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు యువ పారిశ్రామికవేత్త సందీప్ రెడ్డి ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

చింతపూడి గ్రామపంచాయతీ - సి.ఎస్. పురం మండలం

బహిరంగ వేలం పాట ప్రకటన తేది: 24-03-2023

చింతపూడి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 58 నందు గల చిల్లచెట్లను కొట్టుకొనుటకు శ్రీయుత డివిజనల్ పంచాయతీ అధికారి, కనిగిరి వారు మద్దతు ధరను 65 వేల రూపాయలుగా నిర్ణయించారు. కావున **తేదీ 01-04-2023న ఉదయం 11 గంటలకు** చింతపూడి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ గారి అధ్యక్షతన బహిరంగ వేలం పాట నిర్వహించబడునని తెలియ జేయడమైనది. ఆసక్తిగలవారు తదుపరి వివరములకు కార్యాలయ పనివేళల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి వారిని సంప్రదించగలరు.

కార్యదర్శి
చింతపూడి గ్రామ పంచాయతి

పొలాలను సందర్శించిన వ్యవసాయాధికారి

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని మర్లపాడు, ఎం.నిడమలూరు, కందులూరు గ్రామాలలోని శనగ పంట కోసిన, కోతదశకు వచ్చిన పొలాలను మండల వ్యవసాయ అధికారి జి స్వర్ణలత శుక్రవారం వారి సిబ్బందితో కలసి సందర్శించడం జరిగింది. నిన్న కురిసిన అకాల వర్షానికి పంట పరిస్థితి ఎలా ఉన్నది పరిశీలించారు. ప్రస్తుతం మండలములో సుమారుగా 400ఎకరాలు శనగ పంట కోసి ఉన్నారని, నిన్న కురిసిన వర్షాలకు కోసి కుప్పలు వేసిన శనగ పంట భూమికి ఆనుకొనిన కాయలలోని గింజలు కొంచం మెత్తగా ఉన్నాయని అలాంటి రైతులు కోసిన పంట కుప్పలను తిరగ (క్రింద వాటినిపైకి, పై వాటిని కిందకు) వేసుకున్న యెడల పంటకు ఎలాంటి నష్టం ఉండదని లేని యెడల భూమిని తాకి ఉన్న కాయలకు యెక్కువ తేమ వలన భూజు వచ్చి మొలకలు వచ్చే అవకాశం ఉంటుంది అని తెలియజేశారు. కోతకు వచ్చిన శనగ పంటను రైతులు ప్రస్తుతం అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది అని వాతావరణ శాఖ చూచిస్తున్నందున 2లేక 3రోజులు ఆగి వాతావరణము క్లియర్ అయిన తర్వాత పంటలను కోసుకోవాలి అని తెలియజేశారు.

ఆర్డీవో అజయ్ కుమార్‌కు సన్మానం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి డివిజన్ ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్ ను శుక్రవారం కనిగిరి జడ్పిటిసి కస్తూరి రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పిటిసి కస్తూరి రెడ్డి మాట్లాడుతూ కనిగిరి మండలంలో రెవిన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. వీరితో పాటు వైసిపి నాయకులు శ్రీహరి రెడ్డి, ప్రకాశం జిల్లా ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామి రెడ్డి, ఎంఈఓ ప్రసాదరావు ఉన్నారు.

రాహుల్‌ప్రజాధరణ చూసి ఓర్వలేని కేంద్ర ప్రభుత్వం

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం

విశాలాంధ్ర-ఒంగోలు : రాహుల్ గాంధీపై పార్లమెంటులో అనర్హత వేటు వేయడాన్ని చూస్తే బిజెపి రాహుల్ గాంధీని చూసి ఎంత భయపడుతుందో అర్థమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న యువనేత రాహుల్ గాంధీని చూసి అనేక కల్పితమైన కేసులు బిజెపి బనాయిస్తుందన్నారు. 2019 కర్ణాటక కోలార్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార నిమిత్తం కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ ఏదో మాట్లాడారని నరేంద్ర మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని సూరత్‌లో కేసులు బనాయించి వారి ప్రతిష్టను దిగజార్చాలని కుయుక్తులు చేసినను రాహుల్ గాంధీ ప్రతిష్టను ఎవరూ దిగజార్చలేరని శ్రీపతి అన్నారు. అనేకసార్లు ప్రధానమంత్రి పదవి తన ముంగిట వచ్చును తృణప్రాయంగా తిరస్కరించిన గొప్ప యువ నేత అని, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారతీయులందరినీ కలిపే జోడయాత్రలో వారికి లభించిన ప్రజాస్పందన ఓర్వలేక రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తిరుగులేని నేతగా ఎదుగుతున్నారని సహించలేక బిజెపి నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రాహుల్‌పై అక్రమ కేసులు హేయం

విశాలాంధ్ర-ఒంగోలు : రాహుల్ గాంధీ ఎదుగుదల చూడలేని బిజెపి అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేయాలనుకోవటం హేయమైన చర్యఅని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ వుద్దండి మల్లికార్జున అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీజిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ప్రెసిడెంట్ ఈదా సుధాకర రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ వుద్దండి మల్లికార్జున్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేస్ బనాయించి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడంపై జిల్లా నాయకులు ముక్త కంఠంతో ఖండిస్తూ నిరసన తెలియజేశారు. అక్రమ రాజకీయాలకు చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు. ఈరోజు చిన్నచిన్న కేసులు పెట్టి రాహుల్ గాంధీని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మా నాయకుడికి ఎప్పుడు కూడా ఎవర్ని కించపరిచే అవసరం లేదు న్యాయబద్ధంగా కాంగ్రెస్ పార్టీ నేతలు అందరూ కలసి ముందుకు వెళ్తాం రెండు సంవత్సరాల జైలు శిక్షను కోర్టు విధించడం మనం చూస్తుంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ హెూం శాఖ మంత్రివర్యులు వ్యవహరించడం సరికాదన్నారు. వారి సొంత రాజ్యాంగాన్ని ఈ దేశంలో తీసుకొని వస్తున్నారు ఎందుకంటే ఈ రోజు అబద్ధాలను నిజాలుగా చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ప్రచారం అంత కూడా యువ నాయకుడు రాహుల్ గాంధీ గారు చేపట్టిన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా ఈ దేశ ప్రజలకు అసలు నిజాలు తెలిసిపోయేసరికి బిజెపి ప్రభుత్వం వచ్చే ఎలక్షన్ల వరకు రాహుల్ గాంధీ ని ఈ దేశంలో ఎక్కడ తిరగకుండా చేయడానికి పన్నాగాలు పండితుండడం ఈ దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికలలో ఈ దేశం నుంచి తరిమి వేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె రసూల్, జిల్లా ప్రధానకార్యదర్శి. ఆదినారాయణ రెడ్డి, జిల్లా ఐఎన్‌టియుసి చైర్మన్ ఉంగరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇల్లు నిర్మించలేదా...అయితే పట్టా రద్దు

లబ్ధిదారులకు కలెక్టర్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జగనన్న కాలనీలలో ఇళు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణాలు ప్రారంభించక పోతే వారి పట్టాను రద్దు చేస్తామని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన శింగరాయకొండ మండలం సర్రావానిపాలెం లేఅవుట్ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించి లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి అవ సరమైన సిమెంట్, స్టీలు సరఫరా చేస్తున్నామని, ఇసుకను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. అయినా కొందరు ఇళ్ల నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదని అధికారులను ఆయన ఆరా తీశారు. ఆర్థిక సమస్యలే కారణమయితే ప్రభుత్వం చేస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు మరింత ఆర్థిక సహాయం అందిస్తున్నందున ఇళ్ల నిర్మాణాలలో మంచి పురోగతి ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ విధంగా ఆర్థిక సహాయం పొందిన వారు కచ్చితంగా ఆ డబ్బులను ఇళ్ల నిర్మాణానికే ఖర్చు చేసేలా పర్య వేక్షించాలని వి.ఓ.ఏ. లకు దిశానిర్దేశం చేశారు. అలాకాకుండా లబ్ధిదారులు ఉద్దేశ పూర్వకంగానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే వారి పట్టాలను రద్దు చేసి అర్హులైన ఇతరులకు కేటాయించాలని చెప్పారు. ఎస్.టి. సామాజిక వర్గానికి చెందిన సుమారు 40 కుటుంబాలు ఒకే చోట ఉండేందుకు ఇష్టపడుతున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ మేరకు వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు. తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాత శింగరాయకొండ పరిపాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఫీల్డ్ ప్యూరిఫికేషన్, లబ్ధిదారుల టెరీర్ నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. 0-5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డ్ మంజూరు కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఏ.ఎన్.ఎం.లు, అంగన్వాడీలు కలిసి పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం క్రింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినందున ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పాత శింగరాయ కొండలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయ ఈ.ఓ. కృష్ణవేణి, ధర్మకర్తల మండలి చైర్మన్ మాధవరావు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసే తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ ఆలయ చారిత్రక విశేషాలను ఈ సందర్భంగా వారు కలెక్టరు వివరించారు. పాత శింగరాయకొండ పాఠశాలలో నాడు-నేడు పథకం క్రింద చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా ఈ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులోకి తెస్తాం

ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న స్థానిక సోషల్వెల్ఫేర్ జూనియర్ కాలేజీని తొలుత కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతోనూ కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. పదో తరగతి తరువాత ఎం.పి.సి., బై.పి.సి. కోర్సులలో చేరాలనుకుంటున్నట్లు పలువురు విద్యార్థులు చెప్పారు. కానీ ఇక్కడ ఆర్ట్స్ కోర్సులు మాత్రమే ఉన్నాయని వారు కలెక్టర్ అన్నారు. ఈ విషయాన్ని వెంటనే ఆయన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మరియు రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ, విజయవాడ వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అవసరాన్ని తెలియజేస్తూ జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపిస్తే ఆ కోర్సులు కూడా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని వారు కలెక్టర్కు చెప్పారు. కాగా ఈ దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హౌసింగ్ పి.డి. పేరయ్య, మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ ఈ.ఈ. ప్రసాదరావు, ఎం.పి.డి.ఓ. జమీవుల్లా, తహశీల్దారు ఉష, సోమరాజుపల్లి సర్పంచ్ అన్నాబత్తిన సరోజ, ఇతర అధికారులు ఉన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్

టీబిముక్త భారత్ కార్యక్రమం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు 500 రూపాయల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టీబి అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీబి బ్యాక్టీరియా ద్వారా గాలి ద్వారా సోకుతుందని రోగి దగ్గినప్పుడు తుమ్మినప్పుడు ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుందని అన్నారు. ఈ వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి వచ్చిన వారికి రెండు వారాల నుంచి దగ్గు జ్వరంతో బాధపడతారని ఇటువంటి వారు దగ్గరలోని టీబీ నివారణ కేంద్రానికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు పరీక్షలు చేయించుకుంటే మంచిది అన్నారు. టిబి అవగాహనకు మార్చి 24 నుండి ఏప్రిల్ 13 వరకు అవగాహన కార్యక్రమాలను ప్రతి పీహెచ్సీలలో ప్రతి గ్రామంలో నిర్వహించి ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందన్నారు.

29న సాగునీటి ప్రాజెక్టుల పురోగతి - వెలిగొండ ప్రాజెక్టుపై సదస్సు

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్లోని సాగునీటి పారుదల ప్రాజెక్టుల పురోగతి - పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై ఈనెల 29న ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్టు 2023 సెప్టెంబర్‌లో పూర్తవుతుందని పేర్కొని 2023- 24 రాష్ట్ర బడ్జెట్లో కేవలం 100 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గ మన్నారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలలో 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధితులుగా ఉన్న 15 లక్షల మందికి తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం నత్తలతో పోటీ పడుతుందన్నారు. 90 శాతం పూర్తయిన వెలుగొండ ప్రాజెక్టు గత నాలుగు సంవత్సరాలుగా ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారన్నారు. 90 శాతం పూర్తయిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు చెందిన ఏ ఒక్క ప్రాజెక్టును కూడా నేటి ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. నిర్వహణ వ్యయాలకు డబ్బులు సమకూర్చనందున అన్నమయ్య ప్రాజెక్టు, పులిచింతల ప్రాజెక్టులు దెబ్బతిన్నాయన్నారు. ఈ నెల 29న నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి- వెలిగొండ ప్రాజెక్టుపై జరగబోవు సదస్సులో ప్రధాన వక్తలుగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా చైర్మన్ డా"యన్ తులసీ రెడ్డి,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ తో పాటు శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, కంచర్ల శ్రీకాంత్,వివిధ రాజకీయ పార్టీల నేతలు,స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాల నేతలు పాల్గొంటారు. వెలిగొండ ప్రాజెక్టు అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ సదస్సుకు హాజరై జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.సిపిఐ(యం)పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ప్రసంగిస్తూ వెలిగొండ ప్రాజెక్టుల నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.ఈ నెల 29 న ఒంగోలు లో జరగబోవు వెలిగొండ ప్రాజెక్ట్ సదస్సు ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సిటిజెన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు,సిపిఐ జిల్లా నేత యన్. ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, లోకసత్తా జిల్లా ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ అహ్మద్, సుపరిపాలన వేదిక అధ్యక్షులు మాగులూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రకాశమైన మార్కాపురం డివిజన్‌లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశామని ఉప విద్యాశాఖాధికారి ఎ.చంద్రమౌళేశ్వర్ విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని అన్నారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన అన్నారు. ఈ సంవత్సరం గతంలో మాదిరి 11 ప్రశ్నాపత్రాలు ఉండవని, ఈ ఏడాది ప్రభుత్వం వాటిని కుదించి 6 ప్రశ్నాపత్రాలుగా మార్పు చేసిందని అన్నారు. సైన్స్‌కు సంబంధించి జీవ, రసాయన, భౌతిక శాస్త్రాలు ఒకే పరీక్షగా నిర్వహిస్తామని అన్నారు. ఒక్కో విద్యార్థికి ముందుగా 24 పేజీలు ఉండే జవాబుపత్రం అందజేస్తామని అది పూర్తిగా రాసిన తరువాత విద్యార్థులకు కావాలంటే అదనంగా మరో 12 పేజీలు ఉండే జవాబుపత్రం అందజేస్తామని అన్నారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్ ప్రాక్టీసు జరగకుండా జవాబుపత్రాలపై వరుస సంఖ్య ఉంటుందని దీంతో ఒక విద్యార్థి పత్రాలు మరొక విద్యార్థి వద్ద ఉంటే సులభంగా గుర్తించి చూసి రాసేవారిని పట్టుకోవచ్చని అన్నారు. పరీక్షల సందర్భంగా పరిశీలకులకు, డిపార్ట్‌మెంట్ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, మార్కాపురం ఉప విద్యాశాఖ కార్యాలయం పరిధిలో మొత్తం 21 మండలాల్లో 90 పరీక్షా కేంద్రాలు ఉంటాయని అన్నారు. ఈ కేంద్రాలను మూడు కేటగిరిలకు విభజించామని ఏ కేటగిరి క్రింద 38, బి కేటగిరి క్రింద 31, సి కేటగిరిలో 21 పరీక్షా కేంద్రాలు ఉంటాయని అన్నారు. ఈ కేంద్రాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 15300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో 21 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే పరీక్షల కేంద్రాల వద్ద ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని అన్నారు.

రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ప్రజలు కోసం కేసులు ఎదుర్కోవడం, జైళ్లకు వెళ్లడం రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్తేమి కాదని నియోజకవర్గ ఇన్చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు ఆదేశాలమేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలి చేపట్టారు. అనంతరం యర్రగొండపాలెం కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇన్చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ దేశంలో బీజేపీ చేస్తున్న అవినీతి అక్రమాలను రాహుల్ గాంధీ ఎదురిస్తున్నాడనే అక్కసుతో రెండేళ్ల జైలు శిక్ష పడేలా న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తి రాహుల్ కాదని ఆయన తండ్రి, తాత, ముత్తాతలంతా ప్రజల కోసం జైలు జీవితం గడిపినవారేనని గుర్తు చేశారు. అయితే రాహుల్‌పై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెట్టేలా చూడటం దుర్మార్గమని రాహుల్ గాంధీకి ఎటువంటి ఇబ్బంది ఎదురైనా తాము తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. తామంతా రాహుల్ వెనుకే ఉంటామన్నారు. మోడీ చేసిన నియంతృత్వ పాలనతో ప్రజలు ఎలా తీవ్రంగా నష్టపోయారో దేశ ప్రగతి ఏరకంగా దిగజారి పోయిందో అని విమర్శించి నందుకు జైలుకు వెళ్లాలంటే మళ్ళీ మళ్ళీ విమర్శిస్తామని అందుకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా దేశంలో మరియు రాష్ట్రంలో అలాగే జిల్లాలో ఉన్న లక్షల మంది కాంగ్రెస్ నాయకులు కోట్ల మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సెక్రెటరీ అన్నలదాసు ప్రవీన్ కుమార్, జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దుగ్గెంపూడి బాలకృష్ణారెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఆంధ్రప్రదేశ్ రైతులను ఆదుకోవాలని కనిగిరి నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తెలుగుదేశం కార్యాలయంలో రైతులు పడుతున్న కష్టాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసపూరిత విధానాలతో రైతులను అన్ని విధాల మోసం చేస్తు, దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే రైతులకు న్యాయం చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో రైతుకూలీ, కౌలు రైతులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, మహిళలు ఎవరూ కూడా ఆనందంగా లేరన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక పోవడంతో అనేక ఇబ్బందులు గురువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండు పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, యూనిట్ ఇన్చార్జి పెరుగు శివ, ముక్కు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా శరామిశెట్టి శ్రీలత బాధ్యతలు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జిల్లా రెవెన్యూ అధికారిగా శరామిశెట్టి శ్రీలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారులను సమన్వయం చేస్తూ జిల్లా అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని ఆమె చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీలతకు కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మెరిట్ స్కాలర్షిప్‌కు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్షిప్ ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలలో పరీక్షలు రాసిన 6 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ మెరిట్ స్కాలర్షిప్ మంజూరైనట్లు ఆయన తెలిపారు. తొమ్మిదవ తరగతి, పదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, నాలుగు సంవత్సరాల పాటు, సంవత్సరానికి ఒక్కొక్కరికి 12500 రూపాయల లెక్కన స్కాలర్షిప్ వస్తుంది అన్నారు. స్కాలర్షిప్‌కు ఎంపికైన వారిలో బాదం శరణ్య, జిల్లెలమూడి కిషోర్, సూరబోయిన వెంకట సూర్య, పట్లవత్తు విజయ నాయక్, బొజ్జ హేమంత్ శ్రీ నందన్, కటారి బాలకృష్ణ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ క్షయ (టీబీ) అనేది ఒక అంటు వ్యాధి. ఇది మైకోబ్యాక్టీరియం ట్యూబర్ కూలై అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. టీబీ రోగులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్లతో ట్యూబర్ కూలై బ్యాక్టీరియా వ్యాపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవరావు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ షేక్ సుమయ, సిహెచ్ఓ ముంతాజ్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై అధికారులు దృష్టి సాధించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకట్రావు, సిహెచ్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 30 ఉన్నత పాఠశాలలు,10 ప్రాథమికోన్నత పాఠశాలల్లు 75 ప్రాథమిక పాఠశాలలలు పనిచేస్తున్నాయన్నారు. రెండు విడతల డిఏ బకాయిలు చెల్లించాలని 60 సంవత్సరాలు పూర్తయిన ఉపాధ్యాయులకు గ్యాప్ పిరియడ్‌కు సంబంధించిన జీవో విడుదల చేసి వారి ఇంక్రిమెంట్లు సకాలంలో మంజూరు చేయాలని, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తూ సర్వీసులో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ గారి పూల నందు కారుణ్య నియామకాలు ఇవ్వాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఎల్ఐసి ప్రీమియమును విజయవాడ విజయవాడ జిఐఎస్ ఆఫీసు వారు వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని,ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సంబంధించిన ఆరోగ్య కార్డులు వివరాలను ప్రభుత్వం వెబ్సైట్లో ఉంచాలని, ఎయిడెడ్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అన్ని రకాల వసతులు కల్పించాలని, సమస్యలను విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి దశ మరువలేనిది

విశాలాంధ్ర-వెలిగండ్ల : పాఠశాల విద్యార్థి దశ మరువలేనిదని జిల్లా జడ్పిటిసి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గంటక తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇమ్మడి చెరువు వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన వెలిగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ విద్యార్థి దశలో మరపురాని సంఘటనలు జీవితంలో ముడి వేసుకొని ఉంటాయని జీవితం మొత్తం బాల్యం నుంచి పదవ తరగతి వరకు ఆ సంఘటనలో ప్రతినిత్యం మన జీవితంలో నెమరు వేసుకోనెల ఉంటాయని అన్నారు. ఎంపీపీ రామణ మహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితాలను ఎక్కడినుండి బాగా చెప్పాల్సి ఉంటుందని తల్లిదండ్రులు కన్న కలలను సహకారం చేయవలసిన బాధ్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రామణ తిరుపతిరెడ్డి, ఎంఈఓ దాసు ప్రసాద్, సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్ రెడ్డి, నాని ఆది రెడ్డి ఈ క్రమంలో వెలిగండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింత విజయభాస్కర్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లా మద్దిపాడు ప్రభుత్వ హై స్కూల్ నందు దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి ఎంవిఆర్ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. షేక్ మహబూబ్ మాట్లాడుతూ దోస్తీ ఫౌండేషన్ స్థాపించి మొదటిసారిగా ప్రభుత్వ స్కూల్లో చదువుతున్నపేద విద్యార్థులైన మీకు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని కోరుతూ 120 మందికి ఈపరీక్షా మెటీరియల్ మీకు అందజేస్తున్నామని చెప్పారు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ చెడు స్నేహాలకు టీవీలకు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి టీచర్స్ చెప్పే పాఠాలు శ్రద్ధగా విని చదువుకొని మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. స్కూల్ ప్రధానో పాధ్యా యులు పి.కోటిరెడ్డి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి, దోస్తీ ఫౌండేషన్ సభ్యులు షేక్ మున్న. షేక్ అల్లా బక్షు, జడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత వేమా ఎల్లయ్య

జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండల అభివృద్ధి కోసం వేమా ఎల్లయ్య చేసిన సేవలు మరువలేనివని జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మాజీ సంతనూతలపాడు శాసన సభ్యులు వేమా ఎల్లయ్య 27వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం వద్ద చీమకుర్తి జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ బూచేపల్లి శివప్రసాద రెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చీమకుర్తి అభివృద్ధిలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని స్థానిక ఎమ్మార్వో కాంప్లెక్స్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రాథమిక వైద్యశాల, పశువుల క్షేత్రం తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చీమకుర్తి లో చేశారని, అలాగే స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రధానిగా పని చేసిన రోజులలో సంతనూతలపాడు నియోజక వర్గంలో ఎంతోమంది బలహీన వర్గాల పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు చీమకుర్తి లో గాంధీనగర్ నెహ్రూనగర్ రామ్ రాజీవ్ నగర్ హిమగిరి కాలనీ వేమాఎల్లయ్య నగర్ లోని పేదలకు ఇళ్ల స్థలాలను ఏర్పాటు చేశారని మండలానికి చేసిన సేవలు మరువ లేనివని బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దర్శి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వేమా ఎల్లయ్యకు మా కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయని అయన కుమారుడు ప్రస్తుత చీమకుర్తి జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు మండల అభివృద్ధికి పాటుపడుతున్నారని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాని అన్నారు. ముందుగా వేమా ఎల్లయ్య ప్రాంగణం నందు ఉన్న ఎల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చొరవతో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఎమ్ ఆర్ ఓ పిన్నిక మధుసూదనరావు మండల వై ఎస్ ఆర్ పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు పార్టీ పట్టణ అధ్యక్షులు కృష్ణపాటి శేఖర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు వైస్ చైర్మన్ నల్లమాల్లపు మాణిక్యం వైస్ ఎంపీపీ జాస్తి శ్రీనివాసరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.